క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి



బెల్లంమడుగులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ

బైరెడ్డిపల్లె : పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉంటారని హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ సూచించారు. మండలంలోని బెల్లంమడుగు గ్రామంలో శనివారం ప్రజలకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం ఉదయం పూట మంచు అధికంగా ఉండడంతో తలకు టోపీ లేక రుమాలు ధరించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది రేవతి, రమాదేవి పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో భక్తుల సందడి



సదుం: మాలధారణ చేస్తున్న భక్తులు

సదుం: మండలంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకుంది. అధిక సంఖ్యలో భక్తులు వేకువజామున మాల ధారణ చేశారు. ప్రధాన అర్చకుడు నారాయణన్ నంబూద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి అజయ్‌తో ఉపాధ్యాయులు

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఆర్.అజయ్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–17 పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం నందకుమార్ శనివారం తెలిపారు. ఇటీవల పుత్తూరు పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపిక పోటీల్లో విద్యార్థి ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. నవంబర్ 5, 6, 7వ తేదీల్లో ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో బాలుడు పాల్గొంటాడని పేర్కొన్నారు. విద్యార్థిని పీఈటీ ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

పంటలపై ఏనుగుల దాడి



ఏనుగులు నాశనం చేసిన వరిపొలం

సదుం: మండలంలోని గంటావారిపల్లె సమీపంలోని పంటలపై శనివారం ఉదయం ఏనుగులు దాడి చేసినట్టు బాధిత రైతులు తెలిపారు. వరి, టమాటా పంటలను తొక్కి నాశనం చేశాయని గ్రామానికి చెందిన యశోదమ్మ, వెంకటరత్నం, లక్ష్మీదేవమ్మ, గుండాలయ్య తదితర రైతులు వాపోయారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహస్వామి

పుంగనూరు: మండలంలోని మర్రిమాకులపల్లెలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఏడూరు గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి, పుంగనూరు పట్టణంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి, యాబైరాళ్ల మొరవ వద్ద గల శనేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

31 నుంచి గ్రామసభలు

పలమనేరు: మండలంలో ఈ నెల 31 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు జగనన్న పాలవెల్లువ ఫేజ్–2 కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించేలా గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో విద్యాసాగర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో పాడి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందిని కోరారు.

ప్రభుత్వ వైద్యం.. పేదలకు ధైర్యం

ప్రభుత్వాస్పత్రిలో సేవలు పేదవానికి అందని ద్రాక్ష. వైద్యులు, సిబ్బంది కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడే వారు. మందులు అందుబాటులో ఉండేవి కాదు. చిన్న సమస్య అయినా పెద్దాసుపత్రులకు రెఫర్ చేసే పరిస్థితి. ఇది గతం. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి పెద్ద పీట వేశారు. నాడు–నేడు ద్వారా రూ.కోట్లు వెచ్చించి సర్కారు ఆస్పత్రులను కార్పొరేట్‌కు దీటుగా మార్చేశారు. వైద్యులు, సిబ్బందిని నియమించారు. అవసరమైన చోట పడకల సంఖ్య పెంచారు. భవనాలను నిర్మించి కొత్త హంగులు తీసుకువచ్చారు.

– పలమనేరు

- రూ.16 కోట్లతో ఏరియా ఆస్పత్రిలో అదనపు భవనాల నిర్మాణం
- కొత్త బ్లాకుల్లో 20 రకాల వైద్య సేవలు
- ఇన్ పేషెంట్లకు వంద పడకలు సిద్ధం
- బైరెడ్డిపల్లిలో రూ.1.55 కోట్లతో కొత్త భవనం ప్రారంభం

పలమనేరు పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 50 బెడ్లతో నిర్మించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కార్ ఈ ఆస్పత్రి గురించి పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఈ ఆస్పత్రిని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేశారు. నాడు – నేడు కింద నాబార్డ్ 25 ట్రాంచ్ నిధుల ద్వారా రూ.16 కోట్లను 2020లో మంజూరు చేశారు. ఈ పనులను ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ కేఎంవీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ చేస్తోంది. ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. వచ్చే నెలాఖరుకు పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతమున్న ఐదు బ్లాకులకు అదనంగా మరో ఐదు బ్లాకులు ఏర్పాటు కానున్నాయి. ఇందులో భాగంగా అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఆయుష్ విభాగం, ఐసీటీసీ, క్యాజువాలిటీ, బర్న్స్ యూనిట్, ఐసోలేషన్ వార్డు, 21 బెడ్లతో ప్రత్యేక చిన్నపిల్లల విభాగం, పోస్ట్ ఆపరేటివ్ వార్డు, ప్రత్యేకంగా 21 బెడ్లతో ల్యాబర్ బ్లాక్, ఓటీ కాంప్లెక్స్, రేడియాలజీ, ల్యాబ్స్, ఆర్థో, జీఎస్ అండ్ జీఎం, ఐ అండ్ ఈఎన్‌టీ పది బెడ్లు, పే రూమ్స్, బ్లడ్ బ్యాంకు, క్యాంటీన్, బయోమెడికల్ వేస్ట్, మార్చురీ గదులు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆక్సిజన్‌ప్లాంట్ పనులు పూర్తయ్యాయి.



పలమనేరు ఏరియా ఆస్పత్రిలో అదనంగా నిర్మించిన భవనాలు

వంద పడకలతో రోగులకు సేవలు

ఇప్పటి వరకు ఇది వంద పడకల ఆస్పత్రిగా పేరున్నప్పటికీ ఇన్ పేషెంట్లకు 50 బెడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కొత్త భవనాల నిర్మాణంతో వంద బెడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. 23 వైద్యుల పోస్టులు మంజూరయ్యాయి. వాటిలో ఆరు ఖాళీలున్నాయి. వీటిని సైతం కొత్త భవనాల ప్రారంభానికల్లా భర్తీ చేయనున్నారు. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో రోజూ ఓపీ సగటు 500లకు పైగా ఉంది. ఆస్పత్రిలో ఇన్ పేషెంట్లు సగటు 70 మంది వరకు ఉన్నారు. నెలకు సగటున 70 ఆపరేషన్లు జరుగుతున్నాయి. కొత్త భవనాలు అందుబాటులోకి రాగానే ఈ సేవలన్నీ రెట్టింపు అవుతాయని అధికారులు చెబుతున్నారు.



బైరెడ్డిపల్లిలో నూతన భవనంలో ప్రారంభమైన పీహెచ్‌సీ

ఏడు పీహెచ్‌సీల్లో మెరుగైన సేవలు

పలమనేరు ఏరియా ఆస్పత్రితోపాటు, వీకోట కమ్యూనిటీహెల్త్ సెంటర్, పలమనేరు మండలంలో కొలమాసనపల్లి, గంగవరం మండలంలో గంగవరం, పత్తికొండ, పెద్దపంజాణి మండలంలో పెద్దపంజాణి, రాయలపేట, బైరెడ్డిపల్లి మండలంలో బైరెడ్డిపల్లి, తీర్థంలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. బైరెడ్డిపల్లిలో ఇటీవలే నాడు–నేడు ద్వారా రూ.1.55 కోట్లతో నూతన 24 గంటలూ పనిచేసే పీహెచ్‌సీని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. పీహెచ్‌సీల్లో రోజూ సగటున వంద నుంచి 150 దాకా ఓపీలు నమోదవుతున్నాయి. ప్రతి పీహెచ్‌సీకీ 108, 104 వాహనాలు, ఏరియా ఆస్పత్రిలో తల్లీ బిడ్డా ఎక్స్‌ప్రెస్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

- పలమనేరులో ఏరియా ఆస్పత్రి
- వీకోటలో సీహెచ్‌సీ
- మిగిలిన మండలాల్లో ఏడు పీహెచ్‌సీలు
- నాడు–నేడులో పెట్టిన ఖర్చు రూ.17.55 కోట్లు
- ఏరియా ఆస్పత్రిలో రోజువారి ఓపీ సంఖ్య సగటు: 500
- పీహెచ్‌సీల్లో రోజువారి ఓపీ సంఖ్య సగటు :100 నుంచి 140
- ఒక్కో పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది సంఖ్య – 14

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష





రామకుప్పం: బీపీ చెక్ చేసుకుంటున్న ఎమ్మెల్సీ భరత్, చౌడేపల్లె: కంటి అద్దాలు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

రామకుప్పం: ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. ఆయన శనివారం చెల్దిగానిపల్లిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొదట్లోనే వ్యాధులను గుర్తించి వైద్యం అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలుచేస్తున్నారని వివరించారు. శిబిరంలో మొత్తం 503 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. స్థానిక సర్పంచ్ రాజా, ఎంపీటీసీ సౌందర్య, ఈఓఆర్డీ రాధాకృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారులు లోకేష్, దీప, వైఎస్సార్ సీపీ నేతలు ప్రభాకర్ రెడ్డి, రమేష్, సుబ్రమణ్యం, చెంగారెడ్డి పాల్గొన్నారు.

4312 మందికి వైద్య సేవలు

చౌడేపల్లె: మండలంలోని 14 గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో 4312 మందికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారిణి పూజ తెలిపారు. పుదిపట్ల ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జెడ్పీటీసీ దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏటా రెండు సార్లు ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం గొప్పవరమన్నారు. వైద్యులు ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. జగనన్న కంటి వెలుగు ద్వారా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఆయుష్మాన్‌భవ గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సర్పంచ్‌లు హారతి, అనూరాధ, కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు మునెమ్మ, జ్యోతమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంజిబాబు, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ రుక్మిణమ్మ, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్‌భరత్, ఈవోపీఆర్డీ కృష్ణవేణి, డాక్టర్లు అనూరాధ, మనీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం

సదుం: మండలంలో 10 సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు విజయవంతమైనట్టు జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ యల్లప్ప తెలిపారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో నిర్వహించిన వైద్య శిబిరాల్లో 3602 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారని చెప్పారు. 62 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేసినట్టు వెల్లడించారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందని తెలియజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు



డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

చౌడేపల్లె: మండలంలోని డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించి అర్హత ఉన్న వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ రామమూర్తి, జెడ్పీటీసీ దామోదరరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో 91 మంది డప్పు కళాకారులు ఉన్నారని తెలిపారు. వారికి ప్రతినెలా ప్రభుత్వం రూ.3 వేలు పెన్షన్ అందిస్తోందని గుర్తుచేశారు. జగనన్న ప్రభుత్వానికి మళ్లీ మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆయన అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ రామమూర్తి అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రెడ్డిప్రకాష్, రుక్మిణమ్మ, యువ కాపు నాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ నిజలింగప్ప

వి.కోట : రానున్న దీపావళి పండుగ నేపథ్యంలో సీజనల్ లైసెన్స్ కలిగిన టపాసుల దుకాణదారులు నిబంధనలు పాటించాలని అర్బన్ సీఐ లింగప్ప ఆదేశించారు. ఆయన శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో దుకాణదారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలని, దుకాణాలను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. టపాసులను అక్రమంగా నిల్వ ఉంచితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఐ మనోహర్ ఉన్నారు.

రాష్ట్రానికి సీఎం జగన్ అవసరాన్ని వివరిద్దాం

చౌడేపల్లె: ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ఎందుకు అవసరమో ప్రజలకు వివరిద్దామని జెడ్పీటీసీ దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి తెలిపారు. వారు శనివారం పుదిపట్ల, 29 ఏ చింతమాకులపల్లె పంచాయతీల్లోని గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశమయ్యారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి చేపట్టనున్న ఏపీ వై నీడ్స్ జగన్ కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించాలని సూచించారు. చంద్రబాబు చేసిన పనులు, ప్రస్తుతం జగన్ చేసిన పనులను తెలియజేయాలన్నారు. అనంతరం కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంజిబాబు, సచివాలయ మండల కన్వీనర్ రుక్మిణమ్మ, సర్పంచ్‌లు హారతి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

వి.కోట: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీటీసీ అరుణాచలం(హరి) తెలిపారు. ఆయన శనివారం తోటకనుమ పంచాయతీ కొటబండ గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాలువ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంకటేగౌడ పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో రోడ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ క్రమంలో రూ.20 లక్షలు మంజూరు చేసి రోడ్లు నిర్మించాలని ఆదేశించారని పేర్కొన్నారు. నాయకుడు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎంపీటీసీ, అధికారులు

వి.కోటలో పట్టపగలే చోరీ



బీరువాను పగులగొట్టిన దుండగులు

వి.కోట : మండలంలోని తోటకనుమ పంచాయతీలో పట్టపగలే చోరీ జరిగిన విషయం శనివారం సాయంత్రం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. తోటకనుమ పంచాయతీ రాఘవపల్లికి చెందిన బషీర్ కుమారుడు షఫీ కుటుంబ సభ్యులు శనివారం మధ్యాహ్నం సొంత పని నిమిత్తం బయటకు వెళ్లారు. గుర్తుతెలియని దుండగులు ఇంటిలోకి చొరబడి బీరువా పగులగొట్టి 20 గ్రాముల బంగారు ఆభరణాలు, 100 గ్రాముల వెండి, రూ.10 వేల నగదు చోరీ చేశారు. సాయంత్రం ఇంటికి వచ్చిన బాధితులు చూడగా చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సాయం



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న దుర్గ

రామకుప్పం: మండలంలోని గుట్టూరుతండాకు చెందిన త్యాగరాజు(40) నాయక్ శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ గ్రామానికి చేరుకుని త్యాగరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల కోసం రూ.10 వేలు అందజేశారు. ఏ సమస్య వచ్చినా వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, పెద్దతండా సర్పంచ్ మోహన్‌నాయక్, సోమశేఖర్ నాయక్, కామరాజు నాయక్, కుమార్ నాయక్ పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ క్రీడా పోటీలు



విజేతలతో నాయుని చంద్రశేఖర్ మూర్తి తదితరులు

చౌడేపల్లె: మండలంలోని విజయవాణి రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో రెండు రోజులుగా నిర్వహించిన పుంగనూరు జోన్ గ్రిగ్ మెమోరియల్ జోనల్స్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్, హైజంప్, డిస్క్ త్రో, జావెలింగ్ త్రో పోటీల విజేతలకు విజయవాణి విద్యాసంస్థల కరస్పాండెంట్ నాయుని చంద్రశేఖర మూర్తి, నాయుని గురుశేఖరమూర్తి, సుధాకర మూర్తి, మహేష్ బహుమతులు అందజేశారు. సీనియర్ జూనియర్ బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. గెలుపు ఓటములను స్ఫూర్తిగా తీసుకుని, విజయం వైపు దూసుకెళ్లాలని నాయుని చంద్రశేఖర్‌మూర్తి సూచించారు. ఫిజికల్ డైరెక్టర్లు రామచంద్ర, వెంకటేష్, రెడ్డెమ్మ, ఉమాదేవి, రాజేంద్ర, నితిన్, మృదుల తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



ఉపాధ్యాయుడు రామకృష్ణ(ఫైల్)

చౌడేపల్లె: చౌడేపల్లె ఉన్నత పాఠశాల ఇంగ్లీషు ఉపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ(52) శనివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన పుంగనూరు మండలం మద్దనపల్లెకు చెందిన వారు. ప్రస్తుతం పుంగనూరు టౌన్ కొత్త ఇండ్లులో నివాసముంటున్నారు. ఉదయం పాఠశాలకు బయలుదేరే సమయంలో గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మదనపల్లెకు తరలిస్తుండగా మృతి చెందారు. ఆయనకు ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, హెచ్‌ఎం నాగరాజురెడ్డి, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు.

ఈ–క్రాప్ నమోదుపై అభ్యంతరాల స్వీకరణ

చౌడేపల్లె: ఈ–క్రాప్ నమోదుపై అభ్యంతరాలను ఆర్బీకేల్లో తెలియజేయాలని వ్యవసాయశాఖ సహాయ పథక సంచాలకులు శివకుమార్ తెలిపారు. ఆయన శనివారం కాటిపేరి ఆర్బీకేలో ఈ–క్రాప్ నమోదు వివరాలను నోటీసు బోర్డులో ఏర్పాటుచేయించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి రైతుల పేర్లను వివరించారు. పంట సాగు చేయకుండా వివరాలు నమోదు చేసి ఉంటే తెలియజేయాలని కోరారు. ఏఓ జ్యోతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

పలమనేరు: పట్టణ సమీపంలోని బైపాస్ వద్దనున్న వాల్మీకి మహర్షి ఆలయంలో శనివారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం నాయకులు వాల్మీకి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వాల్మీకి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురుమూర్తి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి సమాజ హితం కోసం కృషి చేశారని తెలిపారు. ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఎంబీసీ నాయకుడు పూసల రవి, వాల్మీకి సంఘం నేతలు వెంకటేష్, శంకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె : మండలంలోని చిన్నచల్లారగుంట, బేలుపల్లె, బాపలనత్తం గ్రామాల్లో శనివారం వాల్మీకి మహర్షి జయింతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించి మేళతాళాలు, పండరి భజనలు, కోలాటాలు, బుట్టి బొమ్మలతో ఊరేగించారు. బాపలనత్తంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి, రాజంపేట ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ ఆర్ కేశవులు, నేతలు జయకుమార్‌రెడ్డి, తబ్రాజ్, బాలక్రిష్ణగౌడు తదితరులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.



పలమనేరు: వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న నాయకులు

గంగవరంలో...

గంగవరం: మండలంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను వాల్మీకులు ఘనంగా జరుపుకున్నారు. కొత్తపల్లి గ్రామం దిగువూరులో సర్పంచ్ గిరిరాజారెడ్డి ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూజలు చేశారు. అలాగే గంగవరం బైపాస్ రోడ్డులోని వాల్మీకి ఆలయంలో ఆ సంఘం సభ్యులు, ఉద్యోగులు మహర్షి విగ్రహానికి అభిషేకం, పూజలు చేశారు. అన్నదానం చేశారు. కబడ్డీ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను వాల్మీకి సంఘం నాయకులు డాక్టర్ పి.శివ, విశ్రాంత డీఎస్పీ సుకుమార్, అద్దాల నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ శివ మాట్లాడుతూ వృత్తిలేని కులంగా ఉన్న బోయలకు రిజర్వేషన్ కల్పించి ఆదుకోవాలన్నారు. అనంతరం అన్నదానం చేశారు.



పుంగనూరు: వాల్మీకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, చెంగారెడ్డి, డాక్టర్ శివ

చౌడేపల్లెలో...

చౌడేపల్లె: మండలంలోని తిరుమణపల్లె, మడుకూరు, చౌడేపల్లెలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వాల్మీకి చిత్ర పటాన్ని ఊరేగించారు. అన్నదానం చేశారు.



సదుం: ప్రత్యేకాలంకారంలో వాల్మీకి మహర్షి

సదుంలో...

సదుం: స్థానిక వాల్మీకి మహాముని ఆలయంలో శనివారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు చిన్నరమణ, రామాంజులు, నీలకంఠ, రవి, పవన్, మంజునాథ, పెద్దరత్న పాల్గొన్నారు.



చౌడేపల్లె : తిరుమణపల్లెలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజలు



బైరెడ్డిపల్లె : బాపలనత్తంలో వైఎస్సార్‌సీపీ నేతలను సత్కరిస్తున్న వాల్మీకులు



గంగవరం: కొత్తపల్లిలో వాల్మీకి మహర్షికి పూజలు చేస్తున్న గ్రామస్తులు